క్లుప్తంగా

నేడు వైఎస్సార్ ఆసరా పంపిణీ

జమ్మలమడుగు : మున్సిపల్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం వైఎస్సార్ ఆసరా పంపిణీ జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మల అధ్వర్యంలో నిర్వహించి మహిళా సంఘాల గ్రూపులకు చెక్కులను పంపిణీ చేస్తారన్నారు. మెప్మా సంఘాల సభ్యులు తప్పకుండా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు పెండ్లిమర్రికి ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : వైఎస్సార్ ఆసరా సంబంధించి మూడో విడత లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం పెండ్లిమర్రిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారని కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులు చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఓ మేరెమ్మ తెలిపారు. 6వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంత్సరంలో ప్రవేశాలకు 7, 8, 9 తరగతుల్లో మిగిలిన సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈనెల 27 నుంచి వచ్చే నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంటాయన్నారు. మీసేవ కేంద్రాల వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్, స్టడీ, తల్లితండ్రుల ఆధార్, రేషన్ కార్డు, విద్యార్థిని ఫొటో తప్పనిసరిగా ఉండాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

పులివెందుల టౌన్ : ఆదిత్యబిర్లా ట్రైనీ టైలర్ కొరకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 28వ తేదీన స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఇందులో మహిళలకు మాత్రమే అవకాశం ఉందన్నారు. 500 మంది ట్రైనీ టైలర్లకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పులివెందుల ప్రాంత మహిలలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు 18 ఏళ్ల నుంచి 32 సంవత్సరాలు మధ్య వయస్సు ఉండాలన్నారు. సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తమ వెంట తీసుకురావాలన్నారు. వివరాలకు 96400 15507 ఫోన్‌నంబరుకు సంప్రదించాలన్నారు.

మోటారు వాహనాలకు వేలం

వీరపునాయునిపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన మోటారు వాహనాలను ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజారమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు తమ వెంట ఆధార్ కార్డులు తీసుకుని రావాలని ఆయన కోరారు.

సీఐగా నరేష్‌బాబు

ముద్దనూరు : స్థానిక అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా నరేష్‌బాబును నియమించినట్లు ఉత్తర్వులు అందాయి. నంద్యాల ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహిస్తున్న నరేష్‌బాబును ముద్దనూరుకు బదిలీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో వుండటంతో నెలనుంచి సీఐ పోస్టు ఖాళీగావుంది. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సీఐ నెల క్రితం కర్నూలు జిల్లాకు బదిలీపై వెళ్ళారు.

ఎస్టీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

పులివెందుల రూరల్ : ఎస్టీలుగా ఉన్న వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పులివెందుల వెంకటేశ్వర ఎరుకల సంఘం యూత్ అధ్యక్షుడు వెంకటపతి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని నగరిగుట్ట సమీపంలో ఉన్న రామాలయం వద్ద విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రస్తుతం వాల్మీకులను ఎస్టీలో చేర్చే విషయంలో ప్రభుత్వం ఆలోచించి పార్లమెంట్‌లో బిల్లు పెట్టకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఎరుకల సంఘం యువజన విభాగం నాయకులు రమేష్, నిలీష్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 5వ తరతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చేరేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బండ్లపల్లి నజూరుల్లా ఒక ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి ఈనెల 31వరకు గడువున్నట్లు ఆయన తెలిపారు. ఇంకా ఎవరైనా విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోనివారు చేసుకోవాలన్నారు, వివరాలకు 7780269125 అనే ఫోన్‌నంబరును సంప్రదించాలన్నారు.

విందుకు హాజరైన ఎమ్మెల్యే

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

సోలార్‌తో పంటకు రక్షణ

పెద్దముడియం : మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పశువుల నుంచి కాపాడుకోవడానికి సోలార్ ప్యానెల్(1.50)ను రక్షణగా వాడుతున్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటల కోత అనంతరం మళ్లీ రైతులు రెండో పంటగా నూగు, తెల్ల కుసుమ పంటలను సాగు చేశారు. గ్రామంలోని పశువులు పంటలను నాశనం చేస్తుండటంతో రైతులు పొలంలో సోలార్ ప్యానెల్, బ్యాటరీ ఏర్పాటు చేసి పొలం చుట్టూ గుంజలు పాతి గుంజలకు మూడు వరుసల కడ్డీని చుట్టి బ్యాటరీ నుంచి కనెక్షన్ ఇచ్చారు. దీని వలన ఏవైనా పశువులు, వేరే ఏ జంతువులు పొలంలోకి వెళ్లాలనుకుంటే ముందుగా గుంజలకు చుట్టిన కడ్డీని మొదటగా తగలటంతో స్వల్ప విద్యుత్ షాక్‌కు గురవుతున్నాయి. దీనితో ఆ పొలం వైపు పశువులు రావడం లేదని రైతులు తెలుపుతున్నారు.


పొలంలో సోలార్ ప్యానెల్ ఏర్పాటు చేసిన దృశ్యం


పొలం చుట్టూ గుంజలకు కడ్డీ చుట్టిన దృశ్యం

దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ


దివ్యాంగులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేస్తున్న నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక దివ్యాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో ఆదివారం దివ్యాంగులకు నిత్యవసర సరుకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎస్ఆర్ జనరల్‌స్టోర్ యజమాని శివ తనకుమారుని పుట్టినరోజు సందర్భంగా దివ్యాంగులకు బియ్యంతోపాటు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ జనరల్‌స్టోర్ యజమాని శివ అధ్యాత్మిక సేవా కార్యక్రమాలే కాకుండా ప్రతిఏటా తన కొచ్చే ఆదాయంలో కొంత శాతం సమాజంలోని వెనుకబడ్డ అనాథలు, పేదలు, విద్యార్థులు, దివ్యాంగులకు తన వంతు సేవ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సభ్యులు వెంకటసుబ్బయ్య, సునీల్, గంగయ్య, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇల్లు ప్రారంభం


జగనన్న కాలనీలో ఇంటిని ప్రారంభిస్తున్న పార్లమెంటరీ సెక్రటరీ చంద్రశేఖరరెడ్డి

లింగాల : మండల కేంద్రంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో నూతన ఇల్లును ఆదివారం పార్లమెంటరీ సెక్రటరీ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రారంభిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఎవరైతే ముందుగా ఇల్లు నిర్మించుకుని ఇంటిలో చేరే వారికి తనవంతు సహాయంగా రూ.5 వేలు ఇస్తున్నామన్నారు. ఈరోజు గృహప్రవేశం చేసిన శ్రీనును అభినందించి ఆయనకు రూ.5 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీల పేరుతో ఊర్లను ఏర్పాటు చేస్తున్నారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నారన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచు అనిల్‌కుమార్, నాయకులు లోకేశ్వరరెడ్డి, శివశంకరరెడ్డి, తదతరులు పాల్గొన్నారు.

కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలి

వేంపల్లె : శరీంలోని అన్ని అవయవాల కంటే కన్ను అతి ప్రధానమైందని.. కంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆయన సందర్శించారు. కడప పుష్పగిరి కంటి ఆసుపత్రి, పులివెందుల సురక్ష ఐకేర్ సౌజన్యంతో ఈ ఉచితం శిబిరం నిర్వహించడం ద్వారా ఎంతో మందికి మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ బి.చక్రపాణిరెడ్డి, అధ్యక్షులు కావలి కృష్ణతేజ, డాక్టర్ బాలాంజనేయులు, నవనీశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఓబులరెడ్డి, రవిశంకర్‌గౌడ్, బాషా, కమిటీ సభ్యులు శ్రావణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రత ఎంతైనా అవసరం

వేంపల్లె : మానవ జీవన వికాసానికి పచ్చదనం, పరిశుభ్రత ఎంతైనా అవసరమని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. ఆదివారం స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక శిబిరం ద్వారా రెండవ రోజు స్వచ్ఛభారత్ మీద అవగాహన ర్యాలీ నిర్వహించారు. చక్కని పరిశుభ్రత, చెట్లు పెంచడం ప్రతి ఒక్కరు అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఓబులరెడ్డి, అధ్యాపకులు రాజారెడ్డి, వినోద్, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం


అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట-బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వివిధ పండ్లతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్రస్వామి, అంజనేయస్వామి, సాయిబాబాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్‌కుమార్ ఏర్పాట్లను చేశారు. ఎస్ఐ అరుణ్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

బోయలను ఎస్టీలలో చేర్చడం గొప్ప విషయం

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బోయలను ఎస్టీలలో చేర్చడంపై తీసుకున్న నిర్ణయం గొప్ప విషయమని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదు అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని నగరిగుట్ట రమణప్పసత్రం పాఠశాల సమీపంలో ఉన్న కల్వరి సిలువ ప్రార్థనామందిరం 11వ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికి అన్ని వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు కోలా ప్రసాదు, ఆనందబాబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదు

విద్యార్థులకు చేయూత

లింగాల : ప్రొద్దుటూరు పట్టణంలోని విశ్వప్రేమా వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం లింగాల మండలం తాతిరెడ్డిపల్లె గ్రామంలో ఉన్నత చదువులు చదువుతున్న ఆరు మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ10.116 చెక్కులను అందచేశారు. అదే గ్రామానికి చెందిన సెక్రటరీ మల్లికార్జునప్రసాదు తండ్రి మల్లేసుడు 15వ వర్ధంతి సందర్భంగా డిగ్రీ, బిటెక్, ఎంబీఏ చదువుతున్న విద్యార్థులకు ఆర్థికసాయం అందించామన్నారు. సర్పంచు మల్లికేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ పుష్ప, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ జాతర

చెన్నూరు : మండలంలోని బుడ్డాయపల్లెలో ఆదివారం గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. ఈ జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, జడ్పీచైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేష్ రామాంజులరెడ్డి, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు శివాలపల్లెకు ఎమ్మెల్యే రాక

శివాలపల్లె గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేసేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సోమవారం రానున్నట్లు సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

వైవీయూ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. సావిత్రి సూచించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా కడప నగరం శివానందపురంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నగరపరిధిలోని పక్కీరుపల్లెలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు రెండోరోజు ఆదివారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి, మానవత సంస్థ ప్రతినిధి రామాంజునేయులరెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మార్గనిర్దేశం చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

డీడీ అచ్చెన్న మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

కడప అగ్రికల్చర్: కడప బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ అచ్చెన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిలపక్ష పార్టీ, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై ఆదివారం కడపలోని జిల్లా పశుసంవర్ధశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బీసీ మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, బీఎస్పీ గురప్ప, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా కృష్ణ, జనసేన గౌస్‌బాషా, ఎంఆర్‌పీఎఫ్ నాయకులు దస్తగిరి మాట్లాడుతూ కడప వీపీసీలో డీడీగా పనిచేస్తున్న దళిత ఉద్యోగి అచ్చెన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్నారు. 13 రోజుల క్రితం అదృశ్యమైన అచ్చెన్న శుక్రవారం అన్నమయ్య జిల్లాలో శవమై కనిపించడం బాధాకరమన్నారు. ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తుందని ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకలు సుబ్రమణ్యం, డీహెచ్‌పీఎస్ మునయ్య, సావంత్ సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, సీపీఎం నగర కార్యదర్శి రామోహన్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, ఇన్సాఫ్ మొయినుద్దీన్, హుస్సేన్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న నూగు పంట

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గ్రామంలో నూగు పంట శనివారం రాత్రి గాలీ వానకు పూర్తిగా దెబ్బనింది. తలపనూరు గ్రామానికి చెందిన 5 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో సాగు చేసిన పంటను నూర్పిడి చేసేందుకు కుప్పలు వేసిన నూగు పంట పూర్తిగా దెబ్బతిని మొలకలు రావడం జరిగిందని రైతులు వాపోతున్నారు. దీంతో దాదాపు రూ.60 లక్షలు నష్టపోయామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.


మొలకెత్తిన నూగుపంట

అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ

ఎర్రగుంట్ల : పట్టణంలోని శాంతినగర్ కాలనీలో వెలసిన శ్రీ ఏరువాక గంగమ్మతల్లి జాతర (ఆవుల పబ్బం) ఈనెల 29వ తేదీ నుంచి జరగనుంది. అందుకు గాను అమ్మవారికి పట్టు చీరెలు, వడిబియ్యం, పూలు పండ్లను సుందరయ్య కాలనీలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆదివారం సమర్పించారు. ఈ సందర్భంగా నాలుగు రోడ్ల కూడలి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు పట్టు వస్త్రాలను తీసుకుని మేళతాళాలతో అమ్మవారి వద్దకు బయలు దేరారు. వాటిని గంగమ్మతల్లి ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు, ఏరువాక గంగమ్మతల్లి ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.


అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దృశ్యం

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కేవీ సుధాకర్



ముద్దనూరు : స్థానిక కన్యకాపరమేశ్వరి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కొప్పరపు వెంకటసుధాకర్ శ్రేష్టి ఎన్నికైనట్లు సంఘ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో నూతన కార్యనిర్వాహక సంఘం సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. సంఘం ఉపాధ్యక్షులుగా నాగేంద్రకుమార్, కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా విజయకుమార్, కార్యదర్శిగా ఆరవేటి సుబ్బరాజా, సహాయ కార్యదర్శిగా జగదీష్‌బాబు, కోశాధికారిగా సుదర్శన్‌రావు ఇతర సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సంఘం గౌరవాధ్యక్షుడిగా సురభి శేషయ్య, సలహాదారుడిగా శివరామకృష్ణలు ఎన్నికయ్యారు. సమావేశంలో ఆర్యవైశ్య మహిళా మండలి సంఘం అధ్యక్షురాలిగా కొప్పరపు నాగవిజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా మంజులవాణి, కార్యదర్శిగా సుజాత, ఉపకార్యదర్శిగా స్వరాజ్యలక్ష్మి, కోశాధికారిగా కళావతి ఇతర సభ్యురాళ్లు ప్రమాణస్వీకారం చేశారు.

చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి

కమలాపురం : బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులు రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కమలాపురంలో ఆయన ఇతర నాయకులతో కలసి చలో పార్లమెంటు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ నాయకత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే విధంగా కార్మిక చట్టాలను ప్రభుత్వం మార్పు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరపతలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నాయకులు కుష్మావతి, ఉమాదేవి, సుబ్బలక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న శ్రీనువాసులురెడ్డి

ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలి

వేంపల్లె : 10వ తరగతి పరీక్షల్లో ప్రతి విద్యార్థి మంచి ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర పథక జిల్లా అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఫేర్వెల్ డే సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. కృషి పట్టుదల ఉంటే ఎదైనా సాధించవచ్చునన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్చుకోవాలన్నారు. కష్టపడి చదవడంతో మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. పాఠశాల కరస్పాడెంట్ చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు, చైతన్యరెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు పరీక్షలంటే భయపడవద్దు

వేంపల్లె : విద్యార్థులు పరీక్షలంటే భయపడకూడదని మండల విద్యాశాఖాధికారి వీరారెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలోని ఉషాకిరణ్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన హజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే మంచి ఫలితాలు సాదిస్తారన్నారు. కరస్పాండెంట్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత గమ్యాన్ని అలవరుచు కోవాలన్నారు. అన్ని సమస్యలకు చదువు ఒక్కటే మార్గమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి వీరారెడ్డి

వైద్యులపై దాడులు తగవు

– నేడు నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్య హక్కు చట్టానికి సంబంధించి సరైన విధి విధానాలు లేకపోవడంపై ప్రైవేటు వైద్యులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై పోలీసులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని ఐఎంఏ కడపశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఫరూఖ్, డాక్టర్ వినయ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. లోపభూయిష్ట చట్టం తెచ్చి ప్రైవేటు వైద్యశాలలను బలిపశువు చేయడం సరికాదన్నారు.ప్రభుత్వం ప్రైవేటు వైద్యశాలలకు ఇవ్వాల్సిన అనుమతుల మంజూరులో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉచిత సేవలు అందించాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రైవేటు వైద్యుల హక్కులను పరిగణలోకి తీసుకుని వారితో చర్చించి సమగ్రమైన చట్టాన్ని తెచ్చే వరకు ఆరోగ్యహక్కు చట్టాన్ని నిలిపి వేయాలని కోరుతూ ఐఎంఏ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా కడప నగరంలోని వైద్యులు నల్లబ్యాడ్జీలతో సేవలు అందించాలని నిర్ణయించామన్నారు.

శిల్పారామంలో ఆటవిడుపు


శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు


సందర్శకులతో కిటకిటలాడుతున్న శిల్పారామం

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం ఆటవిడుపు కార్యక్రమం నిర్వహించారు. జీవనజ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులు శాస్త్రీయ, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. స్టెప్పులతో సినీ గీతాలకు చిన్నారులు వేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సెలవు దినం కావడంతో శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ సందర్శకులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పర్యవేక్షించారు.